సహజ సంపదకు ఆపద



గణేష్‌పూర్ శివారులో ఎర్రరాయి తవ్వకాలు

● జోరుగా అక్రమ వ్యాపారం

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్: నాయకులు, అధికారులు మనోళ్లే అన్న ధీమా.. ఎవరేం చేస్తారులే అన్న ధైర్యం.. ఇష్టారాజ్యంగా తవ్వేసినా అడిగేవారేవరంటూ.. అక్రమార్కులు ఎర్రరాయిని యథేచ్ఛగా దోచేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు అటువైపు చూడకపోవడం, ఎవరు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం శోచనీయం. ఈ పరిస్థితి జహీరాబాద్ డివిజన్‌లో నెలకొంది. ఎర్రరాయి నిక్షేపాలకు జహీరాబాద్ ప్రాంతం ప్రసిద్ధి. అనుమతులు లేకపోయినా రూ.కోట్ల విలువైన ఖనిజ సంపదను తవ్వకుని తరలిస్తున్నారు.

రూ.కోట్లలో కొల్లగొడుతున్నారు:

అక్రమార్కులు ప్రభుత్వ నిబంధనలను పాతరేసి కాసుల పంట పండిస్తూ రూ.కోట్లలో కొల్లగొడుతున్నారు. రెండు వందలకు పైగా ఎకరాల్లో అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నాయి. రాయికోడ్, మునిపల్లి, అల్లాదుర్గం, మనూరు, రేగోడు, నారాయణఖేడ్, బీదర్, పరిసర కర్ణాటకలోని గ్రామీణ ప్రాంతాలకు ఎర్రరాయిని చేరవేస్తున్నారు. బహిరంగ మార్కెట్లో ఒక్కో రాయికి రూ.15-20 చొప్పున అమ్ముతున్నారు. నిత్యం 15-20 లారీల మేర రాయిని తరలిస్తున్నారు. అక్రమార్కులు నెలకు రూ.20 లక్షల చొప్పున అక్రమంగా ఆర్జిస్తున్నారు.

వంద ఎకరాల్లో..:

జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, కోహీర్ మండలాల్లోని వందల ఎకరాల్లోని అటవీ, అసైన్డ్ భూములతో సహా పట్టా భూముల్లో ఎర్రరాయిని నిత్యం దోచేస్తున్నారు. జహీరాబాద్, మొగుడంపల్లి మండలంలోని ఖాసీంపూర్, ఆసెగుంట, అర్జున్‌నాయక్ తండా, పర్వతాపూర్, చున్నంబట్టి తండా, హోతి(కె), హోతి(బి), మిర్జంపల్లితండా, జాడి మల్కాపూర్, విఠునాయక్‌తండా, పడియాల్ తండా, న్యాల్‌కల్ మండలం మామిడ్గి, న్యామతాబాద్, గణేష్‌పూర్, రాజోల, కోహీర్ మండలంలోని సజ్జాపూర్, పీచేర్యాగడి తండా, మనియార్‌పల్లి, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో క్వారీల దందా కొనసాగిస్తున్నారు. న్యాల్‌కల్ మండల గణేష్‌పూర్‌లోని అటవీ, అసైన్డ్ భూముల్లోనే సుమారు 60 ఎకరాలకు పైగా గనులు ఉన్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది.

కేసులు నమోదు చేస్తాం.:

రాజు, ఆర్డీవో జహీరాబాద్

రెవెన్యూ, గనుల శాఖ అనుమతులు లేకుండా పట్టా సహా అసైన్డ్, అటవీ భూముల్లో తవ్వకాలు జరపడం నేరం. ఎర్రరాయి తవ్వకాలు గనుల్లో గనుల శాఖ అధికారులతో కలిసి దాడులు నిర్వహించి వాహనాలు, యంత్రాలు జప్తు చేస్తాం. డివిజన్‌లోని తహసీల్దార్లను అప్రమత్తం చేసి అక్రమార్కులకు జరిమానాలు విధించి, క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

అత్యాధునిక యంత్రాలు:

రేయింబవళ్లు తవ్వకాలు జరిపేందుకు రైలు పట్టాలను యంత్రాలకు బిగించి నేలను కోస్తున్నారు. కరెంటు ఉన్నంత సేపు అక్రమంగా వాడుకోవడం, లేకుంటే జనరేటర్లు వాడుతూ పనులు కొనసాగిస్తున్నారు. ఒక్కో క్వారీలో జేసీబీ, టిప్పర్లు, ట్రాక్టర్లు, కొత్త యంత్రాలు వినియోగిస్తున్నారు.

ఉత్తమ బోధన అందించండి: కలెక్టర్



అభ్యర్థులకు పోస్టింగ్ ఉత్తర్వు అందిస్తున్న వల్లూరు క్రాంతి

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: కొత్తగా విధుల్లో చేరే ఉపాధ్యాయులు ఉత్తమ బోధన అందించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులకు జడ్పీ సమావేశ మందిరంలో పోస్టింగ్ ఉత్తర్వులను మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోధనలో మీ మార్కును చూపించాలని సూచించారు. ప్రయోగాత్మకంగా చెబుతూ విద్యార్థులను ఆకట్టుకోవాలని కోరారు. టీఎల్ఎం, తదితర సామగ్రిని ఉపయోగించాలని చెప్పారు. చదువుతో పాటు నైతిక విలువల గురించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, డీఈవో వెంకటేశ్వర్లు, డీసీఈబీ కార్యదర్శి లింబాజీ, సమగ్ర శిక్ష ఏఎంవో వెంకటేశం పాల్గొన్నారు.

ఈనాడు సంగారెడ్డి

పేదల పథకం.. సిబ్బంది మాయాజాలం!

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్: నాగల్‌గిద్ద మండలంలో నిబంధనలకు విరుద్ధంగా ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మల్టీపర్పస్ వర్కర్లకు పని కల్పించారు. ఇదే మండలంలో క్షేత్రస్థాయిలో జరిగిన పనులు, దస్త్రాలను పరిశీలించగా సౌకర్యాలు అమర్చినట్టుగా నమోదు చేసినా, క్షేత్ర స్థాయిలో ఎక్కడా అవి కనిపించలేదు. హరితహారంలో వేయి మొక్కలు నాటినట్లుగా తప్పుగా నమోదు చేశారు. మస్టర్‌లో కూలీల సంతకాలు లేకున్నా, బిల్లులు చెల్లించినట్లుగా గుర్తించారు. బాధ్యుల నుంచి రూ.2లక్షల రికవరీకి ఆదేశించారు.

● అందోలు మండలం రాంసాన్‌పల్లిలో పశువుల షెడ్డుకు ఓ వ్యక్తి రూ.41,472 నగదు తీసుకున్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది పరిశీలించగా షెడ్డు నిర్మించలేదు. ఇలా 'ఉపాధి' పథకంలో పని చేసిన పనుల్లో అధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లుగా సామాజిక తనిఖీలో వెలుగు చూశాయి.

విడతల వారీగా తనిఖీలు:

ఉపాధి పనుల తీరుపై అధికారులు ఏటా సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తి వివరాలు సేకరించి ప్రజాదర్బార్‌లో ప్రకటిస్తారు. విడతల వారీగా ఈ కార్యక్రమాన్ని చేపడుతారు. 2021-22లో రెండు మండలాలు, 2022-23లో 13 మండలాలు, 2023-24లో 17 మండలాల్లో అధికారుల బృందం సామాజిక తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా పలు రకాల మోసాలు వెలుగులోకి వచ్చాయి.



ఉపాధి ప్రజా దర్బార్‌లో పాల్గొన్న అధికారులు

691 మందికి నోటీసులు ..:

ఎంపీడీవో, ఏపీవో, పంచాయతీ కార్యదర్శి, సాంకేతిక సహాయకులు తరచూ తనిఖీ చేస్తుండాలని నిబంధన ఉన్నా, క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ఇదే అదనుగా కొంత మంది క్షేత్ర స్థాయి సిబ్బంది నుంచి పై స్థాయి అధికారి వరకు అవకతవకలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మూడేళ్లుగా 691 మందికి తాఖీదులు ఇచ్చినా, అనంతరం ఎటువంటి చర్యలు తీసుకోలేదు.



జిల్లాలో లెక్కలిలా

సంవత్సరం	అవినీతి జరిగింది (రూ.లో)	వసూలు (రూ.లో)	తాఖీదులు జారీ
2021-22	18,90,538	6,51,437	67
2022-23	1,41,52,366	8,56,716	366
2024-25	16,53,916	1,87,756	258

వసూలులో తాత్సారం:

నగదు స్వాహా చేసిన వారి నుంచి వసూలు చేసేందుకు రెవెన్యూ రికవరీ చట్టం (ఆర్ఆర్‌యాక్ట్) కింద నిబంధనలున్నా క్షేత్ర స్థాయిలో ఆ చట్టాన్ని ప్రయోగించడం లేదు. మూడేళ్లలో రూ.1.76 కోట్ల మేర అవినీతి జరిగిందని సామాజిక తనిఖీల్లో తేల్చారు. కేవలం రూ.16.95 లక్షలు మాత్రమే వసూలు చేశారు. మిగిలిన వాటిని ఎప్పుడు వసూలు చేస్తారో స్పష్టత లేదు. సంబంధిత అధికారులకు అవినీతిలో పాత్ర ఉందని గుర్తించి తాఖీదులతో సరిపెడుతున్నారని, వసూలులో జాప్యం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆన్‌లైన్ సేవలు అమలులోకి వచ్చినా...:

జిల్లాలో 639 గ్రామాల్లో ఉపాధి పథకం అమలవుతోంది. నిధులు పక్కదారి పట్టకుండా ఆన్‌లైన్, యాప్, పలురకాలుగా సాంకేతిక విధానాన్ని అమలు చేస్తున్నా, పరిస్థితిలో మార్పు రావడంలేదు.

ఆర్ఆర్ యాక్ట్ ద్వారా వసూలు చేస్తాం:

జ్యోతి, డీఆర్‌డీవో, సంగారెడ్డి.



ఉపాధి నిధులు పక్కదారి పట్టించిన వారిపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ద్వారా నగదు వసూలు చేస్తాం. త్వరలో పథకం కింద నిధులు స్వాహా చేసిన అంశాలపై సమావేశం నిర్వహించి రాబట్టేందుకు కృషి చేస్తాం.

ఘనంగా మహిళా కిసాన్ దివస్



జహీరాబాద్ కృషి విజ్ఞానకేంద్రంలో మంగళవారం మహిళా కిసాన్ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళా రైతులను సన్మానించారు. వ్యవసాయంలో మహిళా రైతుల పాత్రపై విద్యార్థులు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త వరప్రసాద్, జహీరాబాద్ వ్యవసాయ అధికారి లావణ్య పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, జహీరాబాద్

కొత్త చట్టాల ప్రకారం నేర పరిశోధన: ఎస్పీ



రికార్డులు తనిఖీ చేస్తున్న రూపేష్

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: నేర పరిశోధన చేసే సమయంలో నూతన చట్టాల ప్రకారం జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ రూపేష్‌కుమార్ అన్నారు. పటాన్‌చెరు డీఎస్పీ కార్యాలయాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేసి, సీఐలకు సూచనలు, సలహాలు అందించారు. మెరుగైన పరిశోధన త్వరితగతిన జరిగేలా ఎస్‌హెచ్‌ఓలకు అవగాహన కల్పించాలని డీఎస్పీ రవీందర్‌రెడ్డికి సూచించారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి అనుమానితులను అదుపులోకి తీసుకోవడం ద్వారా కొన్ని నేరాలను నియంత్రించవచ్చని చెప్పారు. అదనపు ఎస్పీ సంజీవరావ్, సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రహిత గ్రామాలుగా మార్చుదాం

కల్హేర్, నారాయణఖేడ్: పొగాకు వినియోగం అనర్థమని, పొగాకు రహిత గ్రామాలుగా మార్చడమే లక్ష్యంగా ముందుకు సాగుదామని పొగాకు నియంత్రణ జిల్లా సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నారాయణఖేడ్ ప్రభుత్వాసుపత్రి, కల్హేర్ మండలం నిజాంపేట్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆయన అవగాహన కల్పించారు. నారాయణఖేడ్‌లో మాజీ ఎంపీ బీబీపాటిల్, మాజీ ఎమ్మెల్యే విజయపాల్ రెడ్డి, వైద్యుడు రాజేశ్వర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

సంగారెడ్డి అర్బన్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ పేర్కొన్నారు. మంగళవారం సంగారెడ్డి బాల సదనంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమ శిక్షణతో మెలగాలని సూచించారు. జిల్లా మహిళ సంక్షేమ శాఖ అధికారిణి లలితకుమారి, బాలసదనం పర్యవేక్షకురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

19న న్యాయ కళాశాలలో తక్షణ ప్రవేశాలు

సంగారెడ్డి టౌన్: స్థానిక గిరిజన గురుకుల సంక్షేమ న్యాయ కళాశాలలో బీఏ, ఎల్ఎల్‌బీ కోర్సులో మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 19న తక్షణ ప్రవేశాలు ఉంటాయని కళాశాల ప్రిన్సిపల్ నిరీక్షణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసి టీజీలాసెట్-2024లో అర్హత పొందిన వారు అర్హులని, ఆసక్తి ఉన్న వారు ధ్రువపత్రాలతో కళాశాలకు రావాలని సూచించారు.

నేడు జిల్లాలో మంత్రి పర్యటన

సంగారెడ్డి అర్బన్: మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈనెల 16న జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని కలెక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికపై కాంగ్రెస్ సమీక్ష



సమావేశానికి హాజరైన ఉమ్మడి మెదక్ నేతలు

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో మంగళవారం గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షి, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, డీసీసీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు నిర్మల, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ఫహీమ్, కాంగ్రెస్ నాయకుడు నీలం మధు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలతోపాటు స్థానిక సంస్థల్లో సైతం కాంగ్రెస్ సత్తా చాటాలని కోరారు. రానున్న రోజుల్లో డీసీసీ అధ్యక్షుల ఆధ్వర్యంలో మండల స్థాయి కార్యకర్తల సమావేశాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని నీలం మధు సూచించారు.

కుదుట పడుతున్న సంజీవన్‌రావుపేట



బాధితులతో మాట్లాడుతున్న బీబీ పాటిల్

నారాయణఖేడ్: ఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటలో కలుషిత నీటిని తాగి ఇద్దరు మృతిచెందగా, అయిదురోజుల్లో దాదాపు 50 మంది అస్వస్థతకు గురైన విషయం విదితమే. గ్రామంలో మంగళవారం పరిస్థితి అదుపులోకి వచ్చిందని ముగ్గురు మాత్రమే స్వల్ప అస్వస్థతతో గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి వచ్చారని శిబిరం ఇన్‌ఛార్జి డా.రాజేశ్వర్ తెలిపారు. ఖేడ్ ప్రాంతీయ ఆసుపత్రిలో మంగళవారం ఇద్దరిని ఇంటికి పంపించామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రమేష్ తెలిపారు. కార్యదర్శి నర్వానాగలక్ష్మి సస్పెండ్ కావడంతో ఆమె స్థానంలో సుభాష్‌రావును నియమించారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం: ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని మాజీఎంపీ బీబీపాటిల్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం విజయపాల్‌రెడ్డితో కలిసి అస్వస్థతకు గురైన బాధిత కుటుంబాలను పరామర్శించారు. మృతి చెందిన సాయమ్మ, మహేష్ కుటుంబాలకు రూ.50 వేల చొప్పున నగదు అందజేశారు. మంగళవారం గ్రామంలో సభ నిర్వహించి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.

అబ్దుల్ కలాం యువతకు ఆదర్శం



తారా కళాశాలలో నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు

సంగారెడ్డి టౌన్, సదాశివపేట, న్యూస్‌టుడే: అబ్దుల్‌కలాం యువతకు ఆదర్శమని స్థానిక తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రత్నప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

ఐక్యంగా ఉంటేనే హక్కుల సాధన

సంగారెడ్డి మున్సిపాలిటీ: నాయీ బ్రాహ్మణులు రాజకీయంగా ఎదగాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాల్వాయి శ్రీనివాస్ అన్నారు. నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో పోతిరెడ్డిపల్లిలో అలయ్- బలయ్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములు, రమేశ్, శ్రీహరి, జిల్లా అధ్యక్షుడు నాగభూషణం, గౌరవ అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి రాజారాం, ఉపాధ్యక్షులు దత్తాత్రేయ, పాల్గొన్నారు.

చిన్నారుల సంక్షేమం.. ఆరోగ్యభాగ్యం

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్: చిన్నారులు ఆరోగ్యంగా ఎదగడమే ముఖ్యం. ఈ ఉద్దేశంతోనే ప్రభుత్వం వీరి సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన చిన్నారులకు పౌష్టికాహారం అందించడం ఇందులో భాగమే. ఆరోగ్య సంబంధ విషయాలపై తల్లిదండ్రులకు అవగాహన కూడా కల్పిస్తున్నారు. ఇవన్నీ చేస్తున్నా కొందరు పోషణ లోప సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో 'న్యూట్రీషియన్ ఛాంపియన్ ప్రోగ్రాం'కు శ్రీకారం చుట్టారు.

ఇదీ కార్యాచరణ:

జిల్లాలోని కేంద్రాల్లో ఐదేళ్లలోపు బాలబాలికల ఎత్తు, బరువును ప్రతి నెలా మొదటి వారంలో నమోదు చేస్తున్నారు. వివరాలు ఎప్పటికప్పుడు నవీకరిస్తున్నారు. సామ్ (అతి తీవ్ర పోషణ లోపం), తీవ్ర పోషణ లోపం (మామ్), బరువు తక్కువ ఉన్నవారిని గుర్తించి సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. వైద్య శాఖ సమన్వయంతో ఆయా విభాగాల్లో అవసరమైన పిల్లలను అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు సంయుక్తంగా సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తున్నారు. ఇందుకోసం బుధ, శనివారాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. వైద్యుడి సూచనల మేరకు అవసరమైన చిన్నారులను సంగారెడ్డి జిల్లా ఆసుపత్రిలోని ఎన్ఆర్‌సీ (పౌష్టికాహార పునరావాస కేంద్రం)కు రెఫర్ చేస్తున్నారు. 'న్యూట్రీషియన్ ఛాంపియన్ ప్రోగ్రాం' నిరంతరాయంగా కొనసాగనుందని ఐసీడీఎస్ అధికారులు పేర్కొంటున్నారు. ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది, వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లకు ఇప్పటికే శిక్షణ అందించారు.

ఎత్తుకు తగిన బరువు లేని చిన్నారులు:	3,425
వైద్య సాయం అందింది	2,091
వయసుకు తగిన బరువులేని వారు:	5,677
వైద్య సాయం అందింది:	1,601
అతి తీవ్ర లోప పోషణ చిన్నారులు:	803
ఆకలి పరీక్ష నిర్వహించింది:	342
వైద్య సాయం అందింది:	426
ఎన్ఆర్‌సీకి రెఫర్ చేసింది:	11

అవగాహన కల్పిస్తూ..:

గత నెల పోషణ మాసోత్సవం సందర్భంగా పోషకాహార ప్రాధాన్యంపై విస్తృతంగా అవగాహన కల్పించారు. పిల్లలు, తల్లులు, గర్భిణులు, బాలింతలను దృష్టిలో పెట్టుకొని పోషక లోపాలను అధిగమించేందుకు చర్యలు తీసుకున్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

జిల్లాలో ఇలా..

అంగన్‌వాడీ ప్రాజెక్టులు	5
మొత్తం కేంద్రాలు	1,504
ఐదేళ్లలోపు చిన్నారులు	95,664

మహిళల్లో రక్తహీనత సమస్యకు చెక్‌పెట్టేలా దృష్టి సారించారు. ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా కార్యాచరణ అమలు చేశారు. ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

సాధారణ స్థితికి తీసుకురావడమే లక్ష్యం:

– లలిత కుమారి, జిల్లా సంక్షేమాధికారిణి



పోషణలోపంతో ఉన్న చిన్నారులను గుర్తించడమే కాకుండా వారందరినీ సాధారణ స్థితికి తీసుకురావాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. అతి తీవ్ర పోషణ లోపం ఉన్న చిన్నారులకు బాలామృతం ప్లస్‌ను అందిస్తున్నాం. ఆకలి పరీక్షలు కూడా చేయిస్తున్నాం. ఇంట్లోనే పౌష్టికాహారం చేసే విధానంపై తల్లులకు అవగాహన కల్పిస్తున్నాం.

ఖనిజాభివృద్ధి నిధి.. బడులకు పెన్నిధి

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, సంగారెడ్డి మున్సిపాలిటీ, మనూరు

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను నియమించింది. ఇందుకోసం జిల్లాలో ఖనిజాభివృద్ధి (డీఎంఎఫ్‌టీ) నిధులు వినియోగించాలని అధికారులు నిర్ణయించారు. ఇంతవరకు బాగానే ఉన్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. నిధులు అందుబాటులో ఉన్నా, పనులు ముందుకు సాగడం లేదు.

ప్రారంభానికి నోచక..:

నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి, నాగల్‌గిద్ద, నారాయణఖేడ్ మండలాల్లో ఎనిమిది పనులు ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. కంగ్టి మండలం భోజ్యానాయక్ తండా, సాధు తండా (తుర్కవాడగౌన్) తండాల్లో రెండింటికీ కలిపి రూ.3.2లక్షల నిధులు కేటాయించినా పురోగతి లేదు. నాగల్‌గిద్ద మండలం రాంచందర్ నాయక్ తండా, గోవింద్ తండా, వాలునాయక్, లక్సిరీ తండాల్లో ప్రాథమిక పాఠశాలలో రూ.14.35 లక్షలు కేటాయించినా ఇక్కడే అదే పరిస్థితి నెలకొంది. నారాయణఖేడ్ మండలం బాలునాయక్ తండా, నాన్యనాయక్ తండాల్లో రూ.4.6 లక్షల నిధులు కేటాయించినా పనులు చేసేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. సరైన సౌకర్యాలు లేక చిన్నారులకు అవస్థలు తప్పడంలేదు. ప్రధానంగా శౌచాలయాల నిర్మాణం, బోరు మోటారు ఏర్పాటు, భవనంపై ట్యాంకు ఏర్పాటు, కులాయిల ద్వారా నీటి సరఫరా వంటి పనులు చేపట్టాల్సి ఉన్నా, తక్కువ నిధులున్నాయని ఎవరు ముందుకు రావడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. సంగారెడ్డి డివిజన్‌లో కేటాయించిన పనులు పూర్తి చేసినా, అందోలు డివిజన్‌పై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.



రాంచందర్ నాయక్ తండా పాఠశాల

జిల్లాలో పనులు ఇలా

డివిజన్	మంజూరైనవి	నిధులు అంచనా (రూ.కోట్లలో)	పూర్తయినవి	ప్రగతిలో ఉన్నవి	ఇంకా ప్రారంభించనివి
సంగారెడ్డి	287	9.10	287	0	0
అందోలు	276	10.46	256	12	8

పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం:

– జగదీశ్వర్, ఎస్ఈ

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులు వేగంగా చేసేలా చర్యలు తీసుకుంటాం. సంగారెడ్డి పీఆర్ డివిజన్‌లో పనులు పూర్తి చేశాం. అందోలు డివిజన్‌లో సమస్య ఎందుకు వచ్చింది? వాటి కారణాలపై క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక తెప్పించుకుంటాం. వాటిని త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.



తుల్జాభవానీ దర్శనానికి పాదయాత్ర

మహారాష్ట్ర తుల్జాపూర్‌లో కొలువైన తుల్జాభవాని అమ్మవారిని దర్శించుకునేందుకు నాలుగు రోజుల కిందట ప్రారంభమైన భక్తుల పాదయాత్ర రేయింబవళ్లు సాగుతోంది. మంగళవారం ఉదయం వరకు జహీరాబాద్ నుంచి 120 కిలోమీటర్ల దూరంలోని మహారాష్ట్ర సరిహద్దు దాటారు. ఈ ఏడాది ఎక్కువ మంది భక్తులు వెళ్తుండడంతో జాతీయ రహదారి భక్తులతో రద్దీగా మారింది. –న్యూస్‌టుడే, జహీరాబాద్

ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించడమే లక్ష్యం

జోగిపేట, న్యూస్‌టుడే : తాగు నీటి ట్యాంకులను శుభ్రం చేయాలని శిక్షణ సహాయ కలెక్టర్ మనోజ్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం నాద్లాపూర్, కోడెకల్, తాడ్మన్నూర్ గ్రామాల్లో ఆయన పర్యటించి, ట్యాంకులు పరిశీలించారు. నిబంధనల ప్రకారం నెలకు మూడుసార్లు వాటిని శుభ్రం చేయాలన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం ఆరోగ్య ఉప కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఎంపీడీవో రాజేశ్, ఎంపీవో అశోక్ ఉన్నారు.

ఉపాధ్యాయపర్వం



చిన్నారిని ఆడిస్తున్న అమ్మమ్మ, వివరాలు రాస్తున్న అమ్మ



భార్య వెళ్లగా కుమారుడిని ఎత్తుకున్న తండ్రి

ధ్రువపత్రాల పరిశీలన, కౌన్సెలింగ్‌కు కాబోయే టీచర్లు సిద్దిపేట కలెక్టరేట్‌కు మంగళవారం వచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి వందలాది మంది తరలిరావడంతో కార్యాలయంలో సందడి నెలకొంది. మహిళ అభ్యర్థులు తమ వెంట తీసుకొచ్చిన శిశువులను కుటుంబ సభ్యులు ఎత్తుకోగా వారు కార్యాలయంలో వచ్చిన పని చేసుకున్నారు. – న్యూస్‌టుడే, సిద్దిపేట

దరఖాస్తుల ఆహ్వానం

దుబ్బాక, న్యూస్‌టుడే: కూడవెల్లి రామలింగేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మంగళవారం ఆలయ ఈవో పి.విశ్వనాథ శర్మ తెలిపారు. ఈ నెల 10న తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ కూడవెల్లి ఆలయానికి సంబంధించి ధర్మకర్తల మండలి నియామకానికి ప్రకటన ఉత్తర్వులు వెలువరించారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 20 రోజుల్లోపు హైదరాబాద్‌లోని దేవదాయ ధర్మదాయ కమిషనర్‌కు గాని, సంగారెడ్డిలోని సహాయ కమిషనర్‌కు గాని దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

అన్నదాత ఆవేదన

'ఫార్మాసిటీ'కి మూడు పంటలు పండించే భూములు సేకరించొద్దని వేడుకోలు



డప్పూర్‌లో ఇటీవల ఆందోళన చేస్తున్న రైతులు

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్, న్యాల్‌కల్:

చుట్టూ ఎత్తైన గుట్టలు.. జలపరవళ్లతో వాగులు, చెక్‌డ్యాంలు, చెరువులు.. పంటలు పండే భూములు.. జింకలు, నెమళ్లు, వలస పక్షుల సంచారం. ఉమ్మడి జిల్లాకు తాగునీరందించే మంజీర నది పరీవాహకం ఇది. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం డప్పూర్, మల్గి, వడ్డి గ్రామాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిన ప్రాంతం ఇది. 2003 ఎకరాల భూసేకరణ చేపట్టాలని నిర్ణయించారు. దీన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర సరిహద్దులోని మూడు గ్రామాల ప్రజలు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే నారాయణఖేడ్-బీదర్ 161(బి) నాలుగు వరుసల జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న రైతుల నుంచి పరిశ్రమల పేరిట స్థలాలు లాగేసుకుంటే ఊరుకోబోమని చెబుతున్నారు.

వాణిజ్య పంటల సాగు

కర్ణాటకలోని బీదర్ జిల్లా కేంద్రానికి సరిహద్దులుగా ఉండే ఈ మూడు గ్రామాల రైతులకు సాగు భూములు జీవనాధారం. చెరకు, అల్లం, పసుపు, పప్పుదినుసులు, నూనె గింజలు సహా కూరగాయలు, పత్తి ఏడాదికి మూడు పంటలు పండిస్తున్నారు. కూరగాయలను బీదర్, జహీరాబాద్, నారాయణఖేడ్, హైదరాబాద్‌లకు తరలిస్తారు. నారాయణఖేడ్-బీదర్ 161(బి) జాతీయ రహదారి పనులు ప్రారంభం కావడంతో మార్కెట్‌లో రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు పలుకుతున్నాయి. భూమిని సేకరించే ప్రాంతాల్లో నీటివనరుల ద్వారా మంజీర నదిలోకి నీరు చేరుతుంది. కలుషితమయ్యే పరిస్థితి తలెత్తుతుందని పర్యావరణ వేత్తలు, జీవవైవిధ్య సంరక్షకులు అంటున్నారు.

ఆందోళనలపై నివేదిస్తాం:

–రాజు, ఆర్డీవో, జహీరాబాద్

ఫార్మాసిటీ భూసేకరణ ప్రక్రియ ప్రభుత్వ మేరకు ముందుకు సాగుతుంది. భూములు కోల్పోతున్న రైతుల ఆందోళనలపై ఉన్నతాధికారులకు నివేదించడం జరిగింది.

ఫార్మాసిటీ ఏర్పాటుకు ప్రణాళిక

• జహీరాబాద్ నిమ్జ్ (జాతీయ ఉత్పాదక పెట్టుబడుల మండలి)కు అనుసంధానం	• సేకరణలో తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని డప్పూర్, మల్గి, వడ్డి గ్రామాలు
భూములు కోల్పోనున్న రైతులు 1,321	మొత్తం ఎకరాలు 2003
పట్టా స్థలాలు 1096.22 ఎకరాలు	అసైన్డ్ భూములు 907.17 ఎకరాలు
సేకరణకు గెజిట్ విడుదల ఆగస్టు 2024	

భూమి సేకరించే గ్రామాల పరిధిలో ఉన్నాయివి

చెరువులు	2
వాగులు	5
చెక్ డ్యాంలు	15
బోరుబావులు	150
సాగునీటి బావులు	186



డప్పూర్, మల్గి శివారుల్లో ప్రతిపాదించిన పట్టా భూములు



సేకరించనున్న చెరువు ప్రాంతం

ఫార్మాసిటీ వద్దు.. పైసలు వద్దు



మా ఎకరా భూమి ఫార్మాసిటీకి పోతోంది. ప్రభుత్వం ఇచ్చే ఎంతటి పైసలైనా మాకొద్దు. మా గ్రామాలకు ఫార్మాసిటీ వద్దేవద్దు.

– శశికళ, మహిళా రైతు

పదిహేను ఎకరాలు కోల్పోతున్నాం



ఐదుగురం అన్నదమ్ములం. మా 15 ఎకరాల భూమిని సేకరిస్తున్నారు. మా అందరికీ 30 మంది సంతానం. గుంట భూమైనా మిగలడం లేదు. తర్వాత పరిస్థితి దయనీయంగా తయారవుతుంది. – మల్లప్ప, డప్పూర్

న్యాయ పోరాటం చేస్తాం



మూడు గ్రామాల సారవంతమైన భూములను సేకరిస్తామని ప్రకటించారు. వాటిని నమ్ముకున్న వారి నుంచి బలవంతంగా సేకరిస్తే న్యాయ పోరాటం చేస్తాం.

– రవికుమార్, మాజీ సర్పంచి, డప్పూర్




విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

జాతీయ యోగా పోటీలకు ఆకునూరు బాలికలు

చేర్యాల, న్యూస్‌టుడే: సంగారెడ్డిలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచి చేర్యాల మండలం ఆకునూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎం.సాత్విక, 7వ తరగతి చదువుతున్న పి.అవంతిక జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని ప్రధానోపాధ్యాయుడు బలయ్య, ఉపాధ్యాయుల బృందం మంగళవారం అభినందించి సన్మానించారు. నవంబరు 8 నుంచి అసోంలోని గౌహతిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎ.కవిత తెలిపారు. గ్రామానికి చెందిన సందబోయిన వెంకటేశ్ రూ.8 వేల విలువైన యోగా దుస్తులు విద్యార్థినులకు అందజేశారు. అమ్మ ఆదర్శ కమిటీ ఛైర్మన్ సైదా, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నింగి.. నేల.. ఒకటై..



ఆకాశంలో మేఘాలు పచ్చని పైర్లను, చెట్లను, గుట్టలను తాకే విధంగా ఉండి ఆహా అనేవిధంగా కనువిందు చేస్తోంది. తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ రామప్ప గుడిపై నుంచి కనిపించిన ప్రకృతి రమణీయత చూసేవారిని కట్టిపడేసింది. – న్యూస్‌టుడే, చేగుంట, తూప్రాన్

మళ్లీ వరద... ఆలయం మూసివేత



ఆలయం ముందు ప్రవాహం



రాజగోపురంలో అమ్మవారికి పూజలు

పాపన్నపేట, న్యూస్‌టుడే: సింగూరు నుంచి నీటిని విడుదల చేయడంతో ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద మంగళవారం ప్రవాహం పెరిగింది. తెల్లవారుజామున అర్చకులు మాత్రమే ఆలయంలోకి వెళ్లి అమ్మవారికి అభిషేకం చేపట్టి మూసివేశారు. రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు కొనసాగించారు.

పట్టపగలు ఇంట్లో చోరీ

చేగుంట, వెల్దుర్తి: పట్టపగలు ఇంట్లో చోరీ జరిగిందని మాసాయిపేటకు చెందిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మంగళవారం గ్రామానికి వెళ్లి విచారించారు. గ్రామానికి చెందిన పాపని శ్రీనివాస్ ఆదివారం వ్యవసాయ బోరు వద్దకు వెళ్లాడు. ఆయన భార్య బయటనుంచి గడియపెట్టి ఇంటి దాబాపైకి వెళ్లి పడుకున్నారు. సాయంత్రం శ్రీనివాస్ ఇంటికి రాగా తలుపులు తీసి ఉన్నాయి. లోపల చూడగా రూ.2 లక్షలు కనిపించలేదు. మంగళవారం పోలీసులు ఆధారాలు సేకరించారు. రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్‌ను వివరణ కోరగా విచారిస్తున్నామన్నారు.

రైతును బురిడీ కొట్టించిన వ్యాపారి

హత్నూర, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వ్యాపారి ఓ రైతును మోసం చేసిన ఘటన హత్నూరలో మంగళవారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన రైతు బాలయ్య తెలిపిన ప్రకారం సోమవారం ఓ యువకుడు బియ్యం కొంటారా అని ఇంటికి వచ్చాడు. కర్నూలు సన్నరకం బియ్యం చూపించి, క్వింటాకు రూ.5,600 ధర చెప్పగా 25 కేజీల అయిదు బస్తాలు కొన్నా. ఊరి బయట డీసీఎం వాహనంలో ఉన్నాయని చెప్పి ద్విచక్రవాహనం మీద అయిదు బస్తాలు తీసుకొచ్చి ఇచ్చి, నగదు తీసుకుని వెళ్లిపోయాడు. మంగళవారం బియ్యం బస్తాలు తీసి చూడగా దొడ్డు రకం కనిపించాయి. దీంతో మంగళవారం పోలీసులను ఆశ్రయించాడు. ఒక్కో బస్తాలో అయిదు కిలోల బియ్యం తరుగు వచ్చిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ప్రకృతి మలచిన పర్యాటకం



గుట్టల మధ్య మహాసముద్రం చెరువు



'లైట్స్ ఆన్.. స్టార్ట్ కెమెరా.. యాక్షన్' అని చిత్రీకరణ సందడి హుస్నాబాద్ మండలం ఉమ్మాపూర్‌లోని మహాసముద్రం చెరువు పరిసరాల్లో ఇటీవల చోటుచేసుకుంటోంది. చుట్టూ ఎత్తైన హరిత కొండలు, పక్షుల కిలకిలా రావాలు, వాటి మధ్య నీటిగలగలలు వెరసి ఆకట్టుకుంటోంది. సెలవు రోజుల్లో ప్రకృతి ప్రేమికులు ఇక్కడి వస్తున్నారు. లఘు చిత్రాలు, ప్రీ వెడ్డింగ్, రీల్స్ లాంటివి ఇక్కడ చిత్రీకరిస్తున్నారు. చెరువు పక్కనే ఉన్న గుట్టను స్థావరంగా చేసుకుని సర్దార్ సర్వాయి పాపన్న ఈ ప్రాంతాన్ని గతంలో కొంత కాలం పరిపాలించారు. ఆనవాళ్లు గుట్టపై ఉన్నాయి. భైరవుడి విగ్రహం గుట్టపై ఉంది. పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేస్తున్నారు. అక్కడికి వెళ్లే రోడ్డు కొన్నిచోట్ల సరిగా లేదు. మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం

ఏటీసీ.. నైపుణ్యాలకు అవకాశమిచ్చి..

ప్రభుత్వ ఐటీఐలకు మహర్దశ



న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్: ఇది పోటీ ప్రపంచం. ప్రతిభ చూపితేనే అవకాశాలు సొంతమవుతాయి. నైపుణ్యాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం పారిశ్రామిక శిక్షణ సంస్థలను (ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) ఏర్పాటుచేసినా ఆశించిన ఫలితాలు కనిపించని పరిస్థితి. నైపుణ్యాల లేమితో కోర్సు పూర్తిచేసినా చాలా మంది విద్యార్థులు అవకాశాలు దక్కించుకోలేకపోతున్నారు. తక్కువ వేతనాలతో పనిచేస్తున్న వారే ఎక్కువ. ఐటీఐలను నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్ల (ఏటీసీ) ఏర్పాటుకు సిద్ధమైంది. తాజాగా ఈ నెల 19 వరకు గడువుతో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది.

ఇవీ కోర్సులు: ● మ్యాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ ● ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫాక్చరింగ్ ● ఆర్టీసియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్ ● బేసిక్ డిజైనర్ అండ్ వెరిఫైయర్ ● అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్ ● మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్స్

ఆవరణలోనే కేంద్రాలు

ప్రభుత్వ ఐటీఐ కళాశాలలన్నింటిలోనూ నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈమేరకు ప్రభుత్వం ఇప్పటికే టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు ఒక్కో ఐటీఐకి రూ.4.50 కోట్లు మంజూరు చేశారు. వీటితో నూతన భవన సముదాయాలను నిర్మిస్తున్నారు. కళాశాల ఆవరణలో 10వేల చదరపు అడుగుల స్థలంలో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఐదేళ్ల పాటు కోర్సు నిర్వహణ బాధ్యతలను సంస్థ చూసుకుంటుంది. కొత్త యంత్రాలు వస్తాయి. వివిధ కోర్సులతో ఐటీఐతో పాటు శిక్షణ పూర్తి చేసుకోగలుగుతారు.

విద్యార్థులకు మంచి అవకాశం:

– రాజేశ్వరరావు, ప్రిన్సిపల్, ప్రభుత్వ ఐటీఐ, సంగారెడ్డి



కోర్సుతో పాటు నైపుణ్యాల పెంపుతో మంచి అవకాశాలు ఉంటాయి. నైపుణ్య శిక్షణ పూర్తిచేసుకుంటే స్వయం ఉపాధిలోనూ రాణించేందుకు వీలుంటుంది. ఏటీసీలో ప్రవేశాలకు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: వ్యక్తి అసభ్యకరంగా వ్యవహరించాడని మనస్తాపం చెందిన మహిళ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చిన్నశంకరంపేట పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై నారాయణగౌడ్ తెలిపిన వివరాలు... పట్టణానికి చెందిన యాదమ్మ(40) కూలీ పనులు చేసుకుంటూ ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులను పోషిస్తోంది. ఏడేళ్ల క్రితం భర్త మృతి చెందగా, గుడిసెలో ఉంటోంది. పట్టణానికి చెందిన రాములు ఆదివారం యాదమ్మ ఇంటికి వచ్చి ఆమెతో అసభ్యకరంగా వ్యవహరించాడు. దీంతో పరువు పోయిందని మనస్తాపంతో మంగళవారం ఉదయం తన ఇంట్లో ఉరేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు నార్సింగ్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి బలవన్మరణం



శివకుమార్

వికారాబాద్, న్యూస్‌టుడే: అప్పులు పెరిగిపోయి.. తీర్చే మార్గం కానరాక పురుగు మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్ ఎస్సై సత్యనారాయణరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కోట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన లక్కాకుల శివకుమార్(31) స్థానికంగా ఎరువులు, పురుగు మందుల దుకాణం నిర్వహిస్తున్నారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో తెలిసిన వారి నుంచి భారీగా అప్పులు చేశారు. తీర్చే మార్గం కనిపించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. జీవితంపై విరక్తి చెందాడు. మంగళవారం కారులో వస్తూ వికారాబాద్ మండలం మైలార్‌దేవరంపల్లి సమీపంలో రోడ్డు పక్కన ఆగాడు. వెంట తెచ్చుకున్న పురుగు మందును కారులోనే తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దారిన వెళ్లే గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి శవాగారానికి తరలించారు. శివకుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రాక్టర్ ఢీకొని దుర్మరణం



అనిల్ కుమార్

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఒకరు మృతిచెందిన ఘటన మంబోజిపల్లి వద్ద మంగళవారం రాత్రి జరిగింది. గ్రామీణ ఠాణా ఎస్ఐ మురళీ తెలిపిన వివరాల ప్రకారం... పాపన్నపేట మండలంలోని యూసుఫ్‌పేటకు చెందిన అనిల్ కుమార్(30) మెదక్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో పని చేస్తున్నాడు. విధులు ముగించుకొని గ్రామానికి చెందిన బాల్‌రాజ్‌తో కలిసి స్వగ్రామానికి వెళుతుండగా మంబోజిపల్లి వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ బలంగా ఢీకొంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అనిల్‌కుమార్ మృతి చెందాడు. బాల్‌రాజ్ చికిత్స పొందుతున్నాడు. అనిల్‌కుమార్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గేదెను ద్విచక్రవాహనం ఢీకొని..



నాగులు

చేగుంట, న్యూస్‌టుడే: ఎదురుగా వచ్చిన గేదెను ద్విచక్రవాహనం ఢీకొనటంతో ఒకరు మృతిచెందిన ఘటన చేగుంట మండలం బోనాల వద్ద సోమవారం రాత్రి జరిగింది. స్థానిక ఎస్సై చైతన్యరెడ్డి తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం పోసాన్‌పల్లికి చెందిన నాగులు(56) వ్యవసాయం చేస్తుంటాడు. శివ్వాయిపల్లిలో బంధువు అంత్యక్రియలకు తన అన్న కుమారుడు మల్లేశంతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. తిరిగి వస్తుండగా.. బోనాల శివారులో అడ్డుగా వచ్చిన గేదెను ఢీకొనటంతో వెనకాల కూర్చున్న నాగులు కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య యాదవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



గురువారెడ్డి


తొగుట, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై తొగుట మండలం గుడికందులకు చెందిన రైతు గోరిట గురువారెడ్డి(42) మృతిచెందాడు. గ్రామస్థులు, మిరుదొడ్డి ఎస్సై పరశురాములు కథనం మేరకు.. గురవారెడ్డికి నాలుగు ఎకరాల పొలం ఉంది. ఇటీవలే మొక్కజొన్న పంట కోశాడు. మళ్లీ ఆ భూమిని పొద్దుతిరుగుడు, మొక్కజొన్న సాగు కోసం సిద్ధం చేశాడు. నీటి తడులు ఇవ్వడానికి మంగళవారం బిందుసేద్యం పరికరాలు అమరుస్తున్నాడు. ఈ క్రమంలోనే భూమిలో చేతికి అందే ఎత్తులో ఉన్న ఎల్టీ, 11 కేవీ విద్యుత్తు తీగలకు బిందుసేద్యం పరికరాలు తగిలి విద్యుదాఘాతానికి గురై గురువారెడ్డి అక్కడికక్కడే మరణించాడు. విషయం తెలిసి భార్య రమాదేవి, కూతురు ఆకాంక్ష, కొడుకు లోకేష్ రెడ్డి బోరున విలపించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై వెల్లడించారు.

బైకు సీటు కింద పాము.. తప్పిన ముప్పు



దోమ, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాన్ని ఓ వ్యక్తి మెకానిక్ దగ్గరకు తీసుకెళ్లాడు. ఆ బండి సీటులోంచి నాగుపాము బయటికి రావడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. దోమ మండలం బుద్లాపూర్‌లోని ఈ ఘటన చోటు చేసుకుంది. నరేష్‌కు స్థానికంగా బైక్ మెకానిక్ షాపు ఉంది. మంగళవారం ఓ వ్యక్తి తన బైక్ నడవడం లేదని ఆయన దగ్గరకు తీసుకువెళ్లాడు. బైక్‌సీటు తొలగించే క్రమంలో నరేష్‌కు సీటుకింద నాగుపాము కన్పించింది. దీంతో ఒక్కసారిగా ఉలిక్కిపడి వెనక్కి తప్పుకొన్నాడు. సరిగ్గా అదే సమయంలో కుల్కచర్ల మండలానికి చెందిన శ్రీనివాస్ వెళ్తున్నాడు. అతడిని పాములు పట్టే అలవాటుంది. పది నిమిషాలు శ్రమించి దాన్ని బయటకు తీశారు.

ఆహార వృథాకు వేద్దాం కళ్లెం



న్యూస్‌టుడే, సిద్దిపేట, సంగారెడ్డి మున్సిపాలిటీ, గజ్వేల్:

అన్నం పరబ్రహ్మ స్వరూపం. పేదరికంలో మగ్గే ఎంతో మంది ఒక్కపూట భోజనానికైనా అలమటిస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆహార వృథాను అరికట్టాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపైనా ఉంది. ప్రతి మెతుకు.. ఇంకొకరి బతుకు కోరుతుందనే కోణంలో యోచించాలని సామాజికవేత్తలు చెబుతున్నారు. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఆ దిశగా చైతన్యం రావాల్సి ఉంది. **నేడు ప్రపంచ ఆహార వృథా నివారణ దినోత్సవం సందర్భంగా** 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

జీవనశైలితో మార్పు

జీవనశైలి మారిన ప్రస్తుత తరుణంలో బయట లభించే ఆహారపదార్థాలను ఎక్కువగా ఆరగిస్తున్నారు. వారాంతాలు, ప్రత్యేక రోజుల్లో ఆహార కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. ఎక్కువ శాతం మంది ఆహారాన్ని వృథా చేస్తున్నారు. కొందరు నిర్వాహకులు మాత్రమే సేవాభావాన్ని చాటుతున్నారు. సరైన అవగాహన లేక కొన్ని కుటుంబాల సభ్యులు ఇంటి వద్ద ఆహారాన్ని వృథాగా పారేస్తున్నారు. పల్లెలతో పోల్చితే పట్టణాల్లో ఎక్కువ శాతం ఈ ధోరణి కనిపిస్తోంది. ఆహారం వృథా చేయకుండా దాని విలువను గుర్తించి సద్వినియోగం చేసేందుకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.



గ్యాస్ ఉత్పత్తి చేసే సిద్దిపేట బుస్సాపూర్ ప్లాంటు

చైతన్యం అందరిలో రావాలి

– జోజి, సామాజిక కార్యకర్త, మాజీ సైనికుడు, సిద్దిపేట



వేడుకలను ప్రణాళికాయుతంగా నిర్వహించాలి. మెనూలో జాగ్రత్తలు తీసుకోవాలి. అనేక రకాలు వడ్డించడంతో సగం వృథాగా మారుతున్నాయి. పారబోతకు ఆస్కారం లేకుండా అవగాహన కల్పించాలి. ఇతర దేశాల్లో హోటళ్లలో అవగాహన కల్పించే సిబ్బంది ఉంటారు. అందరిలో చైతన్యం వస్తే వృథా తగ్గించొచ్చు.

● సిద్దిపేటలో వాణిజ్య సముదాయాలు 3600 వరకు కొనసాగుతున్నాయి. రెస్టారెంట్లు, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, వివిధ రకాల ఆహార తయారీ కేంద్రాల నుంచి నిత్యం 2.50 టన్నుల మేర ఆహార వ్యర్థాలను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 'బసిల్ ఫౌండేషన్ తెలంగాణ' సంస్థ సేకరిస్తోంది. బుస్సాపూర్‌లోని ప్లాంటుకు తరలించి గ్యాస్ ఉత్పత్తి చేస్తున్నారు. రోజులో 1.80 క్యూబిక్ మీటర్ల గ్యాస్ వెలువడుతోంది.

● వేడుకల్లో మిగిలిన ఆహారాన్ని సిద్దిపేట నిరాశ్రయుల కేంద్రం, సర్వజన ఆసుపత్రిలో రోగుల సహాయకులకు పంపిణీ చేస్తున్నారు. ఆలయాల్లో అన్నప్రసాదాల్లో మిగిలినవాటినీ కేంద్రాలకు తరలిస్తున్నారు. అన్నార్థుల ఆకలిని తీర్చడంతో పాటు వృథాకు అడ్డుకట్ట వేసినట్లవుతోంది.

● సిద్దిపేటలోని ఓ రెస్టారెంట్‌లో నిత్యం 50 కిలోలకు పైగా బిర్యానీ, ఇతరత్రా ఆహార ఉత్పత్తులు తయారీ చేసి విక్రయిస్తున్నారు. అందులో దాదాపు 8 కిలోల వరకు వృథాగా మారుతోంది. పలువురు వినియోగదారులు పూర్తిస్థాయిలో తినక అలానే వదిలి పెడుతున్నారు. కొందరు మిగిలిన ఆహారాన్ని ఇంటికి పార్సిల్ తీసుకెళ్తున్నారు. మరికొందరు యాచకులకు అందిస్తున్నారు.

ఆకలి తీర్చడమే.. శరణమయ్యప్పా..



రోడ్డు పక్కన నివసించే వారికి ఆహార పొట్లాలు ఇస్తున్న భక్తులు

రోడ్డు పక్కన రాత్రి సమయంలో ఉండే నిరాశ్రయులకు అయ్యప్ప ఆపద్బాంధవ సేవా సమితి తన వంతు చేయూత అందిస్తోంది. అయ్యప్ప దీక్ష తీసుకున్నా.. లేకున్నా.. సంగారెడ్డి జనప్రియ హోటల్ యజమాని రాజు గురుస్వామి సహకారంతో భోజన ప్యాకెట్లను అందిస్తున్నారు. హోటల్‌లో అమ్ముడు పోగా మిగిలిన తాజా ఆహార పదార్థాలను సభ్యులు ప్యాక్ చేసి కొత్త, పాత బస్టాండ్లు, జిల్లా ప్రభుత్వాసుపత్రి ప్రాంతాల్లో రోడ్డు పక్కన నివసిస్తున్న వారికి అందిస్తున్నారు. ఆకలి తీర్చడాన్ని ఆధ్యాత్మిక సేవగా భావిస్తున్నామన్నారు.

ఇలా చేద్దాం

● ఆహారాన్ని పారేయకుండా ఇతరులకు ఇచ్చే అలవాటు చేసుకోవాలి.

● స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు సామాజిక బాధ్యత నిర్వర్తించాలి.

● పాఠశాలలు, వసతిగృహాల్లో వృథా అవుతోంది. నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి.

● వేడుకల్లో భోజనాల అంచనా ముందుచూపుతో ఉండాలి.

● పోషకాల రేషన్ బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

చికెన్ ధరలు

ఫాంరేటు	126–00	డ్రెస్డ్	215–00
రిటైల్	148–00	స్కిన్‌లెస్	244–00

'ఏకపక్షంగా కమిటీలు వేయడం తగదు'

జహీరాబాద్ అర్బన్, ఝరాసంగం: గ్రామ పంచాయతీలో అధికార పార్టీ నాయకులు ఏకపక్షంగా ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు వేయడం సరికాదని మాజీ సర్పంచులు ఆందోళన వ్యక్తం చేశారు. మొగుడంపల్లి మండల పరిషత్తు కార్యాలయం ఎదుట మంగళవారం వారు నిరసన చేపట్టారు. గ్రామాల్లో ప్రత్యేక పాలన కొనసాగిస్తున్న అధికారులు కాంగ్రెస్ నాయకులకు వత్తాసు పలుకుతూ నచ్చిన వారిని కమిటీల్లో చేర్చుకున్నారని ఆరోపించారు. ఈ కమిటీలను రద్దుచేసి మళ్లీ కొత్తగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ● తిరిగి గ్రామసభలు నిర్వహించి ఇందిరమ్మ కమిటీలు వేయాలని ఝరాసంగం భారాస మండలాధ్యక్షుడు వెంకటేశం మంగళవారం స్థానికంగా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీవో సుధాకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు

సీపీఎం ఏరియా కార్యవర్గం ఏకగ్రీవం

జహీరాబాద్ అర్బన్: జహీరాబాద్ సీపీఎం ఏరియా కార్యదర్శిగా బి.రాంచందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన డివిజన్ మహాసభలో ఏరియా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సభ్యులుగా మహిపాల్, నర్సయ్య, చంద్రన్న, సంగన్న, వీరయ్య గౌడ్, కొడి నర్సింలు, దశరథ్, యూన్నీ నియమితులయ్యారు.

ఊరికి ఉపకారులు!

● యువతకు మార్గదర్శకంగా నిలుస్తూ...

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్, నారాయణఖేడ్, రాయికోడ్

సేవ చేయాలనుకుంటే శ్రీమంతుడే కానవసరం లేదు. మంచి మనస్సు ఉంటే చాలని నిరూపిస్తున్నారు ఈ యువకులు. కన్నవాళ్లను, పుట్టి పెరిగిన ఊరిని మర్చిపోకూడదని భావించి ఊరు బాగుకు తమవంతుగా తోడ్పాటు అందిస్తున్నారు. సమాజ హిత కార్యక్రమాలతో స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఉద్యోగ, ఉపాధి నిమిత్తం పట్టణాల్లో స్థిరపడినప్పటికీ సామాజిక బాధ్యతగా సొంతూరిలో యువజన, ఉద్యోగ సంఘాలు ఏర్పాటు చేసుకుని సేవ చేస్తున్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అండగా నిలవడంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లోని చిన్నారులకు, వృద్ధులకు చేయూతతో ఆదర్శంగా నిలుస్తున్నారు.



ఔరంగ్‌నగర్‌లో ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగాలు పొందిన యువకులను సన్మానిస్తున్న సేవా సంఘం సభ్యులు

బంజారా యువజన సంక్షేమ సంఘం..

మొగుడంపల్లి మండలం పడియాల్‌తండాకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, పోలీసులు, సైనికులు, యువకులు కలిసి 2017 అక్టోబర్‌లో 'బంజారా యువ వెల్ఫేర్ సొసైటీ' ప్రారంభించారు. తండానుంచి 80 మంది వరకు ఈ సంఘంలో సభ్యులుగా చేరారు. వీరంతా మొదట గ్రామంలో చేపట్టాల్సిన సామాజిక సేవా కార్యక్రమాలు గుర్తించి తీర్మానం చేసుకున్నారు. వీరి సంపాదనలో కొంత సేవకు కేటాయించాలనినిర్ణయించి దశలవారీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదరణకు నోచుకోని వృద్ధులు, కుటుంబ భారాన్ని మోయాల్సిన పెద్ద దిక్కు కోల్పోయిన వారిని గుర్తించి ఆర్థిక సాయం అందిస్తున్నారు. రగ్గులు, దుప్పట్లు, స్వెట్టర్లు అందజేస్తున్నారు. పాఠశాల విద్య పూర్తిచేసుకుని ఉన్నత చదువులకు దూరమైన వారిని గుర్తించి ఇంటర్, డిగ్రీలో, వసతిగృహాల్లో ప్రవేశాలు ఇప్పిస్తూ చదువుపై అవగాహన పెంచుతున్నారు.



పడియాల్‌తండాలో రగ్గులు పంపిణీ చేస్తూ...

ఔరంగ్‌నగర్‌లో పోలీసులు, ఉద్యోగులు..

రాయికోడ్ మండలం ఔరంగ్‌నగర్(మధునగరం) గ్రామంలోని పోలీసు, అటవీ శాఖ, ఇతర ఉద్యోగులు ఊరికి ఉపకారం చేయాలని నిర్ణయించారు. గతేడాది 18 మంది యువ ఉద్యోగులు 'ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్' ఏర్పాటు చేసుకుని సేవకు సన్నద్ధమయ్యారు. అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి వేణుగోపాల్, పోలీసులు బస్వరాజు, ప్రభు, విఠల్, పాండురంగం, వీరేశం, రమేష్, క్రిష్ణ తదితరులు నవరాత్రులు, దసరా, బతుకమ్మ వేడుకల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. యువ క్రీడాకారులకు క్రికెట్, వాలీబాల్ తదిత క్రీడా సామగ్రి పంపిణీ చేసి ప్రోత్సహిస్తున్నారు. పాఠశాల విద్యలో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి కళాశాల విద్యలో ఆర్థిక చేయూత ఇస్తున్నారు. ఈ ఏడాది గ్రామం నుంచి ఐదుగురు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించడంతో ఆ సంఘం తరఫున వారిని ఘనంగా సన్మానించారు.

పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదు కీలకం



మాట్లాడుతున్న పాయల్ శంకర్

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి నియోజకవర్గంలో 30 వేల సభ్యత్వ లక్ష్యాన్ని సాధించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. మంగళవారం భాజపా కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై నియోజకవర్గ నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరసయ్య, రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, నాయకులు మాణిక్‌రావు, డాక్టర్ రాజుగౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కొత్త వారి నుంచే దరఖాస్తులు స్వీకరించండి

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా పట్టభద్రులందరూ ఓటరు నమోదు చేసుకోవాలనడం సరికాదని, కొత్త వారి నుంచి మాత్రమే దరఖాస్తులు స్వీకరించాలంటూ సదాశివపేటకు చెందిన న్యాయవాది హరీష్‌కుమార్ మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

రక్తదానం అన్నిటికన్నా గొప్పది



బొంతపల్లి శిబిరంలో...

గుమ్మడిదల: మనిషి జీవితాన్ని నిలబెట్టే రక్తదానం గొప్పదని 'సీజీఆర్ ట్రస్ట్' ఛైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం బొంతపల్లిలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా 'వివేకానంద స్వచ్ఛంద సంస్థ' వ్యవస్థాపకులు భిక్షపతిరెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన మాట్లాడారు. గ్రామ దేవాలయ కమిటీ అధ్యక్షుడు శంకర్‌యాదవ్, మాజీ అధ్యక్షులు నాగేందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ఆ సంస్థ కార్యదర్శులు పాల్గొన్నారు. ● ఖేడ్ ఆక్సీజన్ పార్కు వద్ద కలాం చిత్రపటానికి పురపాలిక మాజీ ఛైర్మన్ నజీబ్, మాజీ ఉప ఛైర్మన్ పరశురాం, కౌన్సిలర్లు అభిషేక్‌షెట్కార్, విఠల్, ఖేడ్ పట్టణ భారాస అధ్యక్షుడు నగేష్ నివాళి అర్పించారు.

మళ్లీ అక్కడే గుంత.. తీరని చింత!



కోహీర్ మండలం రాజనెల్లి- కోహీర్ రహదారిపై ఏర్పడుతున్న గుంత వల్ల తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. మండల కేంద్రమైన కోహీర్‌కు నిత్యం మద్రి, వీర్వేగూడెం, గురుజువాడతోపాటు పలు గ్రామాల ప్రజలు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రివేళల్లో ద్విచక్ర వాహనదారులు ఈ గుంతలో పడి గాయాలైన ఘటనలు ఉన్నాయి. గతంలో ఈ స్థలంలోనే ఇలాగే గుంత ఏర్పడితే అధికారులు అక్కడ పైపైన కంకరవేసి మమ అనిపించారు. ఇప్పుడు వర్షాలకు మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. 'న్యూస్‌టుడే' ప్రతినిధి కోహీర్ పీఆర్ ఏఈ రత్నంను చరవాణిలో సంప్రదించగా ఆయన స్పందించలేదు. – న్యూస్‌టుడే, కోహీర్

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్త సరిత

జహీరాబాద్ అర్బన్: ఆలుగడ్డ సాగులో సమగ్ర యాజమాన్య మెళకువలు పాటించడం కీలకమని ఏరువాక కేంద్రం సంగుపేట శాస్త్రవేత్తలు డా.సరిత, డా. రాహుల్ పేర్కొన్నారు. జహీరాబాద్ మండలం రాయిపల్లి(డి)తో పాటు, హుగ్గెల్లి రైతు వేదికలో ఏఈవో ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఆలు పంట సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపిక మొదలు విత్తన శుద్ధి, విత్తే పద్ధతి, ఎరువులు, కలుపు యాజమాన్యంపై వివరించారు. చీడపీడల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై రైతుల సందేహాలు నివృత్తి చేశారు.

ఘనంగా రేడియో వార్షికోత్సవం



కేకు కోస్తున్న మహిళలు

ఝరాసంగం: డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలోని 'సంఘం రేడియో' 16వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మాచునూర్ పచ్చశాల ఆవరణలో రేడియో నిర్వాహకులు జనరల్ నరసమ్మ, అల్గోల్ నరసమ్మ పూలమాలలతో కలిసి కేక్ కోశారు. ఈ కార్యక్రమంలో డీడీఎస్ సంఘం మహిళలు మంజుల, రోజమ్మ, మమత, చుక్కమ్మ పాల్గొన్నారు.

కౌముది వ్రత మహోత్సవం నేడు

సంగారెడ్డి మున్సిపాలిటీ: పసల్వాది శ్రీజ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో బుధవారం గర్భస్థాన కౌముది వ్రతం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ మహేశ్వరశర్మ సిద్ధాంతి తెలిపారు. ఆశ్రమంలో మంగళవారం ఆయన మాట్లాడారు. సాయంత్రం 5.30 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని చెప్పారు. రాత్రి 7 గంటల నుంచి కౌముది వ్రత మహోత్సవం జరుగుతుందన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలకు సన్మానం



సంజీవరెడ్డిని సన్మానిస్తున్న వాసర్ గ్రామస్థులు

నారాయణఖేడ్: మారుమూల ప్రాంతమైన సిర్గాపూర్ మండలం వాసర్ సమీపంలో సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి కృషి చేసిన ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డిలను ఖేడ్‌లో ఆ గ్రామస్థులు, సమీప గిరిజన తండాల ప్రజలు సన్మానించారు. తదుపరి స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీవో అశోకచక్రవర్తితోపాటు ఉద్యోగులను కూడా సన్మానించారు.

మహారాష్ట్ర 'కాంగ్రెస్ సమీక్ష'లో సురేష్ షెట్కార్: మహారాష్ట్ర ముంబాయిలోని తిలక్ భవన్‌లో మంగళవారం ఆ రాష్ట్ర ఎన్నికల కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ సమీక్షలో జహీరాబాద్ ఎంపీ, నాందేడ్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి సురేష్‌షెట్కార్ పాల్గొన్నారు. నాందేడ్ పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిని ఆయన వారికి వివరించి రానున్న ఎన్నికల్లో విజయానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

గణితశాస్త్రం బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

వట్‌పల్లి, న్యూస్‌టుడే: పోతులబోగుడ ఆదర్శ పాఠశాలలో పీజీటీగా గణితశాస్త్రం బోధన పోస్టు ఖాళీగా ఉందని, తాత్కాలిక ప్రాతిపదికన బోధించేందుకు ఎంఎస్సీ బీఈడీ ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ దీనా మంగళవారం తెలిపారు. ఈనెల 17న పాఠశాల ఆవరణలో నిర్వహించే ముఖాముఖికి ఆసక్తి ఉన్న అభ్యర్థులు విద్యా అర్హత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

క్రీడా ప్రాంగణాలపై నీలినీడలు!



శేర్‌ఖాన్‌పల్లి క్రీడాప్రాంగణంలో పొదలు

హత్నూర, న్యూస్‌టుడే: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన క్రీడా ప్రాంగణాలు అధికారుల అలసత్వంతో అస్తవ్యస్తంగా మారుతున్నాయి. హత్నూర మండలం పరిధి వడ్డేపల్లి, శేర్‌ఖాన్‌పల్లిలో క్రీడా ప్రాంగణాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. సిబ్బంది పర్యవేక్షణ కొరవడటంతో అధ్వానంగా మారాయి. రెండుచోట్ల విలువైన సామగ్రి వృధాగా మారింది. చుట్టూ పొదలు కమ్మేశాయి. వీటి ఆలనా పాలనా పట్టించుకునే వారే లేకపోవడంతో ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది. దట్టమైన పొదల వల్ల క్రీడా ప్రాంగణంలోకి అడుగు పెట్టలేని దుస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపయోగంగా మారిన ప్రాంగణాలను ఉపయోగంలోకి తేవాల్సిన అవసరం ఉంది.



వడ్డేపల్లిలో...

ఉపకారవేతనాలు మంజూరు చేయండి



జాతీయ రహదారిపై ర్యాలీలో డిగ్రీ విద్యార్థులు, సిబ్బంది

జహీరాబాద్: పెండింగులో ఉన్న ఉపకారవేతనాలు, బోధన రుసుములు విడుదల చేయాలని కోరుతూ పట్టణంలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యం, విద్యార్థులు మంగళవారం జహీరాబాద్ నిరసన తెలిపారు. విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని జాతీయ రహదారిపై నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఈ కార్యక్రమంలో జాగృతి డిగ్రీ కళాశాల ఛైర్మన్ సుభాష్‌రెడ్డి, ఆచార్య డిగ్రీ కళాశాల ఛైర్మన్ వెంకటరామిరెడ్డి, ప్రిన్సిపల్ హరికుమార్, వశిష్ఠ కళాశాల ప్రిన్సిపల్ సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

బకాయిల విడుదలకు డిమాండ్

సంగారెడ్డి టౌన్: బోధన రుసుం బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు రాజేశ్, వాణి, హరీశ్ పాల్గొన్నారు.

హరీశ్‌రావును కలిసిన ఖేడ్ భారాస నాయకులు



నారాయణఖేడ్: రాష్ట్ర మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావులను మంగళవారం ఖేడ్ నియోజకవర్గానికి చెందిన పలువురు భారాస నాయకులు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. భారాస మైనార్టీ రాష్ట్రనాయకులు మొహిద్‌ఖాన్, ఖేడ్ మాజీ జడ్పీటీసీ లక్ష్మిబాయిరవీందర్‌నాయక్, కంగ్టి మండల భారాస అధ్యక్షులు గంగారాం, మండల రైబస మాజీఅధ్యక్షులు సత్యపాల్‌రెడ్డి ఉన్నారు.

నేడు 'సమీకృత గురుకులం' నిర్మాణానికి శంకుస్థాపన

పుల్కల్, న్యూస్‌టుడే: బస్వాపూర్ శివారులోని 25 ఎకరాల్లో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల' సముదాయానికి రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ బుధవారం శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గారెడ్డి మంగళవారం పేర్కొన్నారు. మంగళవారం అధికారులు జేసీబీ, ట్రాక్టర్లతో స్థలాన్ని చదును చేసి సిద్ధంగా ఉంచారు. ఆర్డీవో పాండు తహసీల్దార్ కృష్ణ, ఆర్అండ్‌బీ డీఈఈ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ(బీ)లో కలపాలని వినతి

కల్హేర్: కల్హేర్ మండలంలోని వివిధ గ్రామాల్లోని లొద్ద కులానికి చెందిన వారిని బీసీల కులగణన సందర్భంగా బీసీ(బీ)లో కలపాలని పలువురు వ్యక్తులు మంగళవారం కల్హేర్ తహసీల్దార్ శివశ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఉమ్మడి కల్హేర్ మండంలో ఖానాపూర్(కె), మార్డి, మీర్‌ఖాన్‌పేట్, మాసాన్‌పల్లి, నాగధర్, కడుపల్ గ్రామాల్లో లొద్ద కులానికి చెందిన వారు ఎక్కువగా ఉన్నారన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల దరఖాస్తులపై అవగాహన

జిన్నారం: జిన్నారం మండలం వావిలాలలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ నమోదుకు దరఖాస్తులపై మంగళవారం టీఆర్‌టీయూ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పవన్‌రాజ్, మండల శాఖ అధ్యక్షుడు అనిల్‌కుమార్, కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

శుద్ధమైన నీటిని అందించండి

మునిపల్లి: ప్రతిరోజు సరఫరా చేసే తాగునీటిని కలుషితం లేకుండా క్లోరినేషన్ చేయాలని సంగారెడ్డి, జహీరాబాద్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు హరీష్, సాబెర్‌హుసేన్ సూచించారు. మంగళవారం కంకోల్ రైతు వేదికలో తాగునీటి సరఫరా చేసే కార్మికుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడారు. నీటి నాణ్యత పరీక్ష, పైప్‌లైన్ల లీకేజీలు, చేతి పంపుల మరమ్మతులు, ట్యాంకుల నిర్వహణ తదితర అంశాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈలు అంగత్ కుమార్, అనిల్‌కుమార్, మాజీద్ తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేట, కొండాపూర్, న్యూస్‌టుడే: గ్రామీణ నీటి సరఫరా సిబ్బందికి సదాశివపేట ఎంపీపీ కార్యాలయం, కొండాపూర్‌లో శిక్షణ ఇచ్చారు. బోరు మోటార్లు ఎలా మరమ్మతులు చేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఈ షేక్‌పాషా, డీఈ సుచరిత, ఏఈ రవికుమార్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై గుంతలు పూడ్చివేత

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలకు 65వ నంబరు జాతీయ రహదారిపై పలు చోట్ల గుంతలు పడ్డాయి. పట్టణ ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్ ఆదేశాల మేరకు కంకరతో తాత్కాలికంగా వాటిని పూడ్చివేయించారు. ట్రాఫిక్ పోలీసులు పలు చోట్ల పారచేత బట్టి చదును చేశారు.

ప్రజా భాగస్వామ్యంతోనే పనుల గుర్తింపు

జహీరాబాద్ అర్బన్: ప్రజా భాగస్వామ్యంతోనే ఉపాధి హామీ పనుల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా అదనపు డీఆర్ డీవో బాలరాజు అన్నారు. జహీరాబాద్ మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం డివిజన్ లోని జహీరాబాద్, మొగుడంపల్లి, కోహీర్, ఝరాసంగం, న్యాల్ కల్, రాయికోడ్ మండలాలకు చెందిన గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవోలు, సాంకేతిక సహాయకులతో సమీక్ష నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న పనులపై నవంబరు 30 తేదీల్లోపు గ్రామసభలు పూర్తిచేయాలని సూచించారు. గ్రామ ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శులు, రైతులు, కూలీలను భాగస్వాములు చేసి గ్రామ అవసరాలకు అనుగుణంగా పనులు గుర్తించాలని చెప్పారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

జిన్నారం, న్యూస్‌టుడే: ఐడీఏ బొల్లారం పారిశ్రామికవాడలో బుధవారం ఉదయం 7.00 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు విద్యుత్తు కోత అమలు చేస్తున్నట్లు ఏడీఈ అశోకరావు ఏఈ రామకృష్ణారెడ్డి తెలిపారు. 132 కేవీ విద్యుత్తు కేంద్రంలో మరమ్మతుల కారణంగా ఈ కోత విధిస్తున్నామని, పారిశ్రామికవేత్తలు సహకరించాలని కోరారు.

కారు, ద్విచక్రవాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

కవేలీ కూడలి(కోహీర్), న్యూస్‌టుడే: కోహీర్ మండలం కవేలి కూడలి సమీపంలోని 65వ నంబరు జాతీయ రహదారిపై కారు, ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి మండలం గుడితండాకు చెందిన రాజేందర్ కారులో జహీరాబాద్ వైపునకు వెళ్తుండగా పట్టణ సమీపం పస్తాపూర్‌కు చెందిన రూబెన్ ద్విచక్ర వాహనంపై అపసవ్య దిశలో రోడ్డు దాటుతున్న క్రమంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాద ఘటనలో రూబెన్ తలకు, ఛాతి భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. 108లో క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మహిళ అదృశ్యం!

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ఓ మహిళ వారం కిందట అదృశ్యమవగా కుటుంబ సభ్యులు ఆలస్యంగా మంగళవారం ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల 9న సాయంత్రం పుల్కల్ మండలం ముదిమాణిక్యంకు చెందిన ఓ వివాహిత(30) ఆర్టీసీ బస్సులో సంగారెడ్డికి వచ్చి తిరిగి వెళ్లలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లవద్ద వెతికినా ఆమె ఆచూకి లభించలేదు. దీంతో ఆమె భర్త మంగళవారం సంగారెడ్డి పట్టణ ఠాణాలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు సీఐ వెల్లడించారు. ఆచూకి లభిస్తే పోలీసుస్టేషన్ ల్యాండ్ నంబర్ 08455-276333, సీఐ నంబర్ 8712656718కు సంప్రదించాలని పోలీసులు కోరారు.

అదృశ్యమైన వ్యక్తి విగత జీవిగా..



దస్తగిరి

గుమ్మడిదల, న్యూస్‌టుడే: అదృశ్యమైన వ్యక్తి మృతిచెందిన ఘటన బొంతపల్లి గ్రామ పరిధిలో చోటుచేసుకుంది. గుమ్మడిదల ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దోమడుగుకు చెందిన దస్తగిరి(28) ఈనెల 13వ తేదీన సీతాఫలాలు తెస్తానని ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆయన భార్య గుమ్మడిదల ఠాణాలో అదేరోజు ఫిర్యాదు చేశారు. మంగళవారం కుటుంబ సభ్యులు, స్నేహితులు వెతుకుతుండగా బొంతపల్లి పరిశ్రమల సమీపంలోని కుంటలో దస్తగిరి మృతదేహం కనిపించింది. సమీపంలోని చెట్ల వద్ద పండ్లకు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు నీటిలోపడి మృతిచెంది ఉండవచ్చని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనలు

హత్నూర, జోగిపేట, హత్నూర, న్యూస్‌టుడే: కాసాలలో దుర్గా భవానీ, ఊరడమ్మల విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం ధ్వజారోహణ ఘట్టం అట్టహాసంగా జరిగింది. ● జోగిపేట పట్టణంలోని క్లాక్‌టవర్, హనుమాన్ ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవార్ల విగ్రహాలను సోమవారం రాత్రి నిమజ్జనాలకు తరలించారు. దాండియా ఆటలు చూపరులను ఆకట్టుకుంది. కౌన్సిలర్లు చిట్టిబాబు, సురేష్, నాగరాజు, మాజీ ఎంపీటీసీ శివశేకర్, మాజీ కౌన్సిలర్లు ప్రవీణ్‌కుమార్, శివకుమార్ యూత్ పాల్గొన్నారు. ● దౌల్తాబాద్‌లో ప్రతిష్ఠించిన దుర్గాభవాని మాతను మంగళవారం ప్రజలు పూజించి ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు.



కాసాల: ప్రతిష్ఠాపనలో భక్తులు..



ధ్వజారోహణం...



జోగిపేట క్లాక్ టవర్ వద్ద అమ్మవారి పూజల్లో కౌన్సిలర్లు, స్థానికులు



హత్నూర మండలం దౌల్తాబాద్‌లోని దుర్గాభవాని మాతకు బోనాలు తీసుకెళ్తూ..

విద్యార్థులకు సన్మానం



న్యాల్‌కల్: మీర్జాపూర్(బి) ఉన్నత పాఠశాలలో గతేడాది పదో తరగతిలో అత్యధిక జీపీఏ సాధించిన నలుగురు విద్యార్థులను అదే పాఠశాలలో ఫిజికల్ సైన్స్ బోధిస్తున్న శ్రీనివాస్ వారి తండ్రి జ్ఞాపకార్థం 'సిల్వర్ మెడల్స్'ను అందించారు. ప్రస్తుతం 10వ తరగతి విద్యార్థులు కూడా రానున్న పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక జీపీఏ సాధిస్తే బాహుమతులు ఇస్తానని హామీ ఆయన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాజ్‌కుమార్, ఎంపీడీవో రాజశేఖర్, ఏపీవో సురేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా బాబుసింగ్ మహరాజ్ నియామకంపై హర్షం

నారాయణఖేడ్: మహారాష్ట్రలోని పొరాదేవి ఆశ్రమ పీఠాధిపతి బాబుసింగ్ మహరాజ్‌ను అక్కడి ప్రభుత్వం గవర్నర్ కోటాలో ఎమ్మెల్యేగా నియమించడంపై ఖేడ్ బంజారా ఉద్యోగుల సేవా సంఘ జిల్లా గౌరవ అధ్యక్షులు మేఘ్యానాయక్, ఖేడ్ బాధ్యులు హరిసింగ్, రాజ్‌కుమార్ చౌహాన్, శివరాం, రతన్‌సింగ్ తదితరులు మంగళవారం హర్షం వ్యక్తంచేశారు.